# బాలసాహితి

# మత్స్యావతారము

పూర్వం ద్రావిడ దేశాన్ని సత్యవ్రతుడనే రాజు పరిపాలించాడు. సత్యమునే పలకటం ఆయన వ్రతం. అందువల్ల సత్యవ్రతుడనే పేరు ఆయనకు ఎంతైనా తగిఉన్నది. అన్ని ప్రాణులను చాల దయగా చూచేవాడు. ప్రజలకేకాక ఎవరికే ఆపదవచ్చినా ఆదుకొని చేతనయిన ఉపకారం చేసేవాడు. ఆయన రాజ్యంలో నలుమూలలా శాంతి నిండిఉన్నది. ఆయన శ్రీవిష్ణుదేవుణ్ణి మహాభక్తితో పూజించుతూ ఉండేవాడు. ఆ రాజు కృతమాలిని అనే నదిఒడ్డునఆశ్రమ మేర్పరచుకొని నీటినిమాత్రమే ఆహారంగా పుచ్చుకుంటూ శ్రీవిష్ణువునుగూర్చి తపస్సు చేశాడు. ఒకనాడు కృతమాలినీ నదిలో స్నానంచేసి విష్ణుదేవుడికి నీళ్లతో తర్పణం విడుస్తున్నాడు. దోసిలిలో ఏదో కదిలినట్లయింది. చూచాడు. అది చిన్న చేపపిల్ల. చిన్న తోక, చుక్కలవంటి కళ్లు, తళుకు తళుక్కున మెరిసే ఒళ్లు. ఒంటినిండా రంగురంగుల చుక్కలు. ముద్దులు మూటకట్టుతున్నది ఆ బుల్లిచేప. రాజు చటుక్కున నీళ్ళలో విడిచిపెట్టాడు. అప్పుడా చేపపిల్ల నీటిపైకి తేలి ఆ రాజుకళ్ళలోనికి జాలిగా చూస్తూ రాజు కర్థమయ్యే భాషతో ఇట్లా అన్నది.

“ఓ దయామయా! ఈ దిక్కులేని చేపపిల్లమీద నీకు జాలి లేదా? చూడు! ఈ నదిలో ఎన్నెన్ని పెద్ద పెద్ద చేపలూ, మొసళ్లూ ఉన్నవో! మాజాతిలో జ్ఞాతిశత్రుత్వము ఉన్నదని నీకు తెలిసిందేకదా! చిన్న చేపలను పెద్ద చేపలు తింటాయి. నా కండ్ల ఎదుటనే ఇట్లాంటి ఘోరాలెన్నో జరిగాయి. నా గతి కూడ అంతేకదా? ఈ గండం ఒకవేళ గడిచినా మరో గండం తప్పదు. బెస్తవాండ్లు గాలాలు వేసి గాలించి వలలు వేసి జల్లించి, ఎక్కడనక్కినా పట్టుకుంటారు. ముడిపెనికి తోరణాలు గుచ్చుతారు. రాజా! నీకు తెలియనిదేమున్నది! అన్ని దానాలకంటె ప్రాణదానం గొప్పది. శరణమన్నవారిని కాపాడటం మీ రాజధర్మంకూడ,” అని మొఱ పెట్టుకున్నది.

రాజు హృదయం కరిగిపోయింది. నీటితో నిండిన తన కమండలంలో వేసుకొని తన యింటికి తీసుకొని వెళ్లాడు. కమ్మని మిఠాయి ఉండలు కడుపునిండా మేపాడు. ఆ రాత్రి గడచింది. తెల్లవారగానే రాజు తన చేపపిల్ల ఎట్లా ఉన్నదీ చూడవలెనని వెళ్లాడు. బుల్లిచేప పెద్దదయింది. కమండలంపట్టీ పట్టనట్లుగా పెరిగింది. రాజు “ఓ బుల్లిచేపా బాగున్నావా?” అని పలుకరించాడు. “ఆఁ! నీదయవల్ల బాగానే ఉన్నాను. కాని రాజా! నాకీ కమండలం ఇరుకుగా ఉన్నది. ఇంకా కొంచెం పెద్దచోటుచూపించు” అన్నది చేప.

రాజు తన యింటిలో ఉన్న పెద్ద నీటితొట్టిలో ఆ చేపను విడిచిపెట్టాడు. చూస్తూ ఉండగానే అది ఒక ముహూర్తంలో మూడు చేతుల పొడవు పెరిగిపోయింది. “ఓ సత్యవ్రతా! ఈ తొట్టి నాకు చాలటం లేదయ్యా! ఇంతకంటె విశాలమైన తావు చూపించలేవూ! నీకు పుణ్యముంటుంది” అని అన్నది.

రాజు దాని పెరుగుదలకు ఆశ్చర్యపడుతూ దానినొక కొద్ది పాటి మడుగులో విడిచిపెట్టాడు. మరి కొంతకాలానికి ఆ మడుగు కూడ చాలనంత పెరిగింది. ప్రతిదినం రాజు దానికి ఆహారం పెడుతూ యోగక్షేమాలు విచారించి వెళ్లే

అక్కిరాజు వెంకటేశ్వరశర్మ

కాడు. ఓ చేపతేడా! ఎట్లా ఉన్నావు? అని రాజు కుశలప్రశ్న చేశాడు. "ఆఁ! అడుగుతావు! ఏదో ఇట్లా ఉన్నాను! మీ నం మెదవటానికైనా తోక కదపటానికైనా, చోటు లేదాయె" అని పెదవి విరిచింది.

రాజు నవ్వుతూ ఈ వింతచేపను సరోవరంలోకి, అక్కడనుండి నదిలోకి చాల ప్రయత్నంచేసి ఆవిధంగానే మార్పించాడు. కాని ఆ అబ్బురపు చేపకు అక్కడ కూడ ఇబ్బందిగానే ఉన్నది. "నేను స్వేచ్ఛగా సంచరించాలంటే ఈ నది నాకేమూలకు? ఎంతసేపూ నిలువునా ఈదవలసిందే కాని అడ్డం తిరిగితే మరి ఒడ్డు తగులుతుందిగా" అని గొణిగింది. రాజు చాల పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసి మహా ప్రయాసతో దాన్ని సముద్రంలో విడిచిపెట్టించాడు. గిఱ్ఱున ఆ రాజు మెదడులో ఒక ఆలోచన మెదిలింది. కొద్ది రోజుల క్రిందత తన దోసిలిలోకి వచ్చిన బుల్లి చేపపిల్లేనా ఇది? ఎంతలో ఎంత మార్పు! ఇది నిజమైన చేపేనా? ఇందులో ఏదో రహస్యమున్నది. ఇంతకాలం తాను తపసు చేస్తున్న శ్రీమహావిష్ణువే నో! ఏమో!..."చేపరూపంలో ఉన్న ఓ దేవదేవా! నీ వెవరు? ఇటువంటి చేపను మునుపెన్నడు కని విని ఎఱుగము. నీవు రోజుకు నూఱామడ పొడవు పెరుగుతావు. పైగా మాటలాడగలవు. ఇటువంటి చిత్రం ఎందైనా ఎప్పుడైనా కద్దా! నాకు అనుమానంగా ఉన్నది. నన్ను కరుణింపవచ్చిన శ్రీ విష్ణుదేవుడవు కావా?" అని మోకరిల్లాడు. చేప నవ్వి ఔనన్నట్లు తల ఊపింది.

"ఓ మహావిష్ణూ! ఈ నీచమైన చేపరూపం ఎందుకు తాల్చావు! లోకాలన్నీ పుట్టించి పెంచి లయింపచేసే మహానుభావుడవే!" అని అన్నాడు సంభ్రమాశ్చర్యాలతో.

ఆ మహామీనం ఇట్లా అన్నది. "దానికేమిలే అవసరంకొద్దీ ఏ వేషమైనా వేయవలసివస్తుంది. అందులోని మంచిచెడ్డలు నాకే మీ చెందవు. ఏ అవతారమెత్తినా నీవంటి సజ్జనులను కాపాడటం, దుర్మార్గులను శిక్షించటం, అదేగా ప్రయోజనం. ఈ మత్స్యావతారానికి కొన్ని ప్రయోజనాలున్నవి. ఇంక ఏడు రోజులకు బ్రహ్మకొక్క పగలు నిండుతుంది. జలప్రళయం రానున్నది. సముద్రాలు ఉప్పొంగి ప్రపంచాన్నంతా ముంచివేస్తవి. మూడు లోకాలూ నశించిపోతాయి. అంతా జలమయం. దానిని నైమిత్తిక ప్రళయమంటారు. ఆసమయంలో నిన్ను నేను రక్షిస్తాను. నీవున్న తావుకు ఓడను పంపుతాను. దానిలో ఎక్కు! చూడు! ఈలోపల మంచి మంచి ఓషధులను అన్ని రకాల విత్తనాలను సేకరించి, దాచిపెట్టి ఉంచుకో!" అని చెప్పి నీళ్లలో మాయమయింది ఆ పెనుచేప.

రాజు చెప్పినట్లే అన్ని ఓషధులను సేకరించాడు. దర్భలమీద తూర్పువైపు తలగడ ఉంచి మనస్సులో శ్రీమహావిష్ణువును ధ్యానించుకుంటూ ఉన్నాడు. ఆ జలప్రళయం రానేవచ్చింది. ఆకాశమంతా ప్రళయమేఘాలు అలుముకున్నవి. ఉరుములు - మెఱుపులు - పిడుగులు - తెంపులేని జడివానలు - ఏనుగు తుండములంతేసి ధారలు...అబ్బ. సముద్రాలన్నీ కలిసిపోయినవి. భూమి కనపడదు. ఏ ప్రాణీ కనపడదు. చెట్టు...పుట్ట...గుట్ట అన్నీ మునిగిపోయినవి. అంతా జలమయం. మరి సత్యవ్రతుడెక్కడ?

అదుగో! పెద్ద ఎత్తైన పర్వతశిఖరం. దానిమీద నిలుచుండి చూస్తున్నాడు. ఆ నావ ఇంకా రాలేదే! నీటి ప్రవాహం శిఖరాన్ని ముంచుతున్నది. పాదాలు తాకినై. మోకాళ్లు దాటినై, ఇంకా రాలేదే! రాలేదే...రాదేమో! అనుకుంటున్నాడు.

అదుగో! దూరంగా ఏదో చుక్కలాగా కనిపిస్తున్నది. సందేహంలేదు. నిజంగా ఓడే. చాల పెద్దదికూడ. తనదగ్గరికే వచ్చింది. ఎంత చక్కని నావ. సమయానికే వచ్చి తనను రక్షించింది. శ్రీ మహావిష్ణువు చెప్పిననావ ఇదే కాబోలు. లోపల ఎవరో వేద ఋక్కులు చదువుతున్నారు. సప్తర్షులు కాబోలు. తనను ఎక్కమన్నట్లు చేతి నూపుతున్నారు.

సత్యవ్రతుడా ఓడ నెక్కాడు. తమకు కావలసిన సౌకర్యాలన్నీ అందులో ఉన్నాయి. అంతా దేవుని మాయ అనుకున్నాడు. ఆ పెనుచేప కూడ దాపుననే ఉన్నది. దాని కొమ్ముకు పెద్దపాము గట్టిగా చుట్టుకొని ఉన్నది. తోక ఓడకానుకొని ఉన్నది. ఆ పాము తోకను ఓడకు ముడివేస్తే ఓడ కొట్టుకుపో

కుండా ఉంటుందన్నారు ఋషులు. సత్యవ్రతుడు అట్లాగే ముడివేశాడు. ఓడకు ఏ అపాయం రాకుండా చూచుకుంటూ ఓడను ఆ మహామీనం ఎటో లాగుకొనిపోతున్నది. ఓడను పొడవాలని ఎన్నో తిములు తిమింగిలాలు వచ్చాయి. అన్నింటిని ఆ మహామీనం మట్టుపెట్టింది అదేదో పెద్ద పర్వత శిఖరం. దాని దగ్గరకు లాగి తెచ్చి ఓడను దాని కానించింది. రాజు ఓడకు లంగరు వేశాడు. ఆ కాళరాత్రివేళ బ్రహ్మ దేవుడు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. పగలంతా పాపం సృష్టి చేసిచేసి అలసిపోయినాడు కాబోలు!

అంతలో హయగ్రీవుడనే రాక్షసుడు వచ్చి ఆయనదగ్గరున్న వేదాలను దొంగిలించాడు. ఆ సముద్రం అట్టడుగుకు పోయి దాక్కున్నాడు. కాని ఇదంతా చేపరూపంలోఉన్న విష్ణువు చూస్తూనే ఉన్నాడు. ఆ పెనుచేప మీసాలు కదిపి - తోక సారించి- రెక్కలు రిక్కించి రివ్వున బాణంలాగా వెళ్లి ఆ క్రూర రాక్షసుణ్ణి కొమ్ముతో పొడిచి చంపింది. ఆ వేదాలను తిరిగి తెచ్చింది. సత్యవ్రతుడి దయాగుణాన్ని ఎంతో ప్రశంసించింది. ధన్యవాదాలు చెప్పింది. రాజు మీనరూపంలో ఉన్న విష్ణువును స్తుతించాడు. చూస్తూండగానే ఆ మహామీనం శ్రీ మహావిష్ణువుగా సాక్షాత్కరించింది.

శంఖము - చక్రము - గద - ఖడ్గము - నాల్గు చేతులలో నాల్గు ఉన్నవి. మెడలో కౌస్తుభమణి. వనమాల. పీతాంబరం. కన్నులలో తొలికే కరుణరసం. ఎంత దివ్య మంగళవిగ్రహం. శ్రీ విష్ణువు రాజు మంచితనాన్ని, భక్తిని, పరోపకారబుద్ధిని మెచ్చుకున్నాడు. 'మనువు' అనే అధికారం ఆయనకిచ్చాడు. మనువుసంతతివారము కనుక మనకు మానవులని, మనుష్యులని పేర్లు వచ్చినవి.

అంతలో నిద్రనుండి బ్రహ్మ లేచాడు. మరల యథావిధిగా సమస్త లోకసృష్టికి పూనుకున్నాడు. విష్ణువు వేదాలను తెచ్చి బ్రహ్మకిచ్చాడు. ఈ సత్యవ్రతుడు. మరల సృష్టించే పనిలో బ్రహ్మకెంతో తోడ్పడ్డాడు. తనవద్ద నున్న బీజాలను, ఓషధులను బ్రహ్మకిచ్చాడు. ఆ సత్యవ్రతుడే 'వైవస్వత మనువు' అనే పేరుతో ఇప్పుడు దేవలోకంలో ఉండి పరిపాలిస్తున్నాడు. ఈయన పధ్నాలుగురుమంది మనువులలో ఏడవవాడు. సత్యము-దయ, పరోపకారబుద్ధి-దైవభక్తి, ఇటువంటి సద్గుణాలుండటంవలన సత్యవ్రతుడు భగవంతునికి ప్రియభక్తుడై మనువు కాగల్గాడు. సత్యవ్రతునివలె 'ఆత్మవత్సర్వభూతాని' అన్ని ప్రాణులు తనవంటివే అని భావించి, వేటికీ కీడు చేయక చేతనయిన ఉపకారం చేయటం మంచిది. అట్టివారిని భగవంతుడు సత్యవ్రతుణ్ణి రక్షించినట్లు రక్షిస్తాడు. ★

# మంత్రగాని మురళి

**నవ్యశ్రీ**

అమ్మా! మన ఊరి సంత
లో చూచా ఒక్కవింత!
బలే బలే అయిన వింత!
కలలో కనబడని వింత!

గారడి వాడొక్కడు మన
ఊరి సంత కొచ్చాడే!
చేసి మాయలెన్నెన్నో
చూచు వారి కనువిందుగ

బంకమట్టిలో మామిడి
టెంకపాతి నీరుపోసి
నిముషంలో దాన్ని పెద్ద
మామిడిచెట్టుగ చేసెను!

దాని పండు కోసిఇవ్వ
తిన్నానే కడుపునిండ!
ఎంత తియ్యగా ఉందో
అబ్బా! నే చెప్పలేనె!

రబ్బరు బంతులతో కను
పుబ్బ నవ్వుపుట్టించా
డబ్బా! అది చూచి చూచి
అబ్బుర పడినారంతా!

ఆ మాదిరిగా వాడె
న్నో మాయలు చేశాడే!
చూచిన వారంత తమకు
తోచిన ధన మిచ్చారే!

మాయంతా వాడూదే
మాయ మురళిలో ఉందని
అన్నారే దోవలోన
నాన్నగారు నన్నుచూసి!

త్వరగా కొనవమ్మా! ఆ
మురళివంటి దొకటినాకు!
ఇల్లంతా ఇక మామిడి
పళ్ల మయము చేస్తానే!